డాయనో అమృతమూర్తిలా కన్పించాడు. ఆయన తలని తన హృదయాని కదుముకొంది. అప్పట్లో పెను అలల తాకిడికి ఓలలాడిన ఓడలా తను అశాంతితో అలజడితో కంపించింది. కాని యిప్పుడు, తుపాను తరువాత ప్రశాంతతలాగ, తన హృదయం కూడా శాంతించింది. జీవితాంతం వరకూ తనకి కావలసింది యీ ప్రశాంతమేకాని అలజడి కాదు. కేశవరెడ్డి అలజడీ-హడావిడీను. డాక్టరు ప్రశాంతతా, గాంభీర్యమూను. కేశవరెడ్డితో జీవితంలో తనిట్టే అలసిపోతుంది. డాక్టరుతో జీవితం దినదినం తనకి శక్తినిస్తుంది-ఆ రాత్రి అనుభవంవల్ల తెలుసుకొన్న పరమ సత్యం యిదే-అనుకొంది పార్వతి.

...ఏ పట్టణంనుంచి వచ్చి యీ అలజడి రేపేడో ఆ పట్టణానికే వెళ్ళిపోనీ యీ కేశవుని. ఏ ప్రమాదమైతే అతన్ని సహజ సౌందర్యపు ప్రాపు జేర్చిందో, అలాంటిదే ఏ ప్రమాదమూ, యీ సజహ సౌందర్యాన్ని నాశనం చెయ్యనీయకు అని తనకి తనే హితబోధ చేసుకొంది-పార్వతి. తన భర్త, డాక్టరుతల తన హృదయంలో ప్రశాంతంగా నిద్రిస్తూంది; అర్థం తెలియని వూహల సాలిగూళ్లు కూడా మెల్లిగా విడిపోయి, పార్వతి హృదయం కూడా ప్రశాంతమైంది.

ఉదయం నిద్రలేవగానే పనికుర్రాడు ఒక వుత్తరం డాక్టరుగారి బిల్లూ చేతికిచ్చాడు. ఉత్తరం పార్వతికి-"నేను వెళ్లిపోతున్నాను. నీ జీవితం అతి సుఖవంతం. ఇదివరలో నా ఊహలన్నీ ఎంత అబద్ధమో నిన్ను చూసి తెలుసుకొన్నాను; నిన్నరాత్రి తెలుసుకున్నాను. హాయిగా వుండు. లీలావతి ఎప్పుడో వెళ్ళిపోయింది. నే వెళ్ళిపోతున్నా. ఎక్కడికి? నే వచ్చిన మహా పట్టణానికి కాదు. మా వూరికి" కేశవరెడ్డి వ్రాశాడు. పార్వతి హృదయం తేలికపడింది.

జీవితప్రవాహం యథాప్రకారం సాగిపోతుంది. వానొస్తే, వరదొస్తే ఉప్పొంగుతుంది. కాని కొద్ది రోజుల్లోనే మళ్లీ ప్రశాంత ప్రవాహమే అది.

---

స్కెచ్

# మాతృమూర్తికి ఉత్తరం

మొవ్వ రాంబాబు

ఉత్తరం వచ్చిందని పోస్టుజవాను ఇవ్వగానే సుభద్రమ్మగారు ఆత్రంగాతీసి చదవటం మొదలుపెట్టింది. కొడుకుదగ్గరనుండి జాబుకొరకు ఆమె అనేక నెలలనుండి ఎదురుచూస్తున్నది. ఆమె అనేకమార్లు విశ్వాన్ని ఈ విషయంపై హెచ్చరిస్తూ కూడా ఉత్తరాలు వ్రాసింది. విశ్వంతో ఉన్నచిక్కు ఇది ఒకటే. వ్రాస్తే ఒక్కటే పెద్ద ఉత్తరం-ఆయిదారు పేజీలది వ్రాస్తాడు. లేకపోతే నాలుగైదు నెలలవరకు అతనివద్దనుండి చిన్న విషయంకూడా తెలియదు.

"అమ్మా! నానుండి అనేకవిషయాలు తెలుసుకోవాలని చూస్తూ వుంటావు. ఏరోజు కారోజు ఇదే టైముకు బయటు కిటికీలోగుండా బజారులోనికి చూస్తూ ఉంటావని నేను మరచిపోలేను. తీవ్రపరిణామాలకు దారితీసే నా యీ నిశ్చయం ఎంతనిదానంగా బలపడిందో నీకూ అంతనిదానంగానే తెలియపరచాలనే ఉద్దేశంతో ఆలస్యం చేసున్నాను. వ్యక్తులమధ్య ఏర్పడే స్నేహ సంబంధాలు - వాటి పర్యవసానాలు, వీటిని తెలియపరచటానికి నాకు ఇంకా టైముకావాలి. దాదాపు ఒక జీవితకాలమే కావాలేమో!

నా ఆరోగ్యవిషయాన్ని గురించి చెప్పుతాను. డాక్టరుగారు నిర్విచారంగా ఉండమని చెప్తాను. నా కొరకు ప్రత్యేకంగా ఒకనర్సును నియమించారు. నాతోకలిసి ఆమె రోజూ బీచికి వస్తూంటుంది. నిర్మల పరిచర్యలలో నీకు ఏమాత్రమూ తీసిపోదు. సామాన్యంగా సాయత్రం షికారు వెళ్ళినప్పుడే ఎక్కువగా మాట్లాడుకోటానికి అవకాశం ఉంటుంది. జనాన్నుండి చాలాదూరం వెళ్ళి ఏకాంతమయిన ప్రదేశంలో కూర్చుంటాము. మా చుట్టూ ఎంతో నిశ్శబ్దం. సముద్రఘోషకూడా ఆ నిశ్శబ్దాన్ని భగ్నం

చేయలేవు. బయలుదేరేముందు ఆమెను అనేకమయిన ప్రశ్నలు అడుగుదామనుకునేవాణ్ని. కాని నిర్మలమైన ఆమెముఖం ఆ నిశ్శబ్దంలో చూచేటప్పటికి నాలో మాటలు పెగిలిగావు.

"ఏమిటి బాబుగారు ఆలోచిస్తున్నారు?" ఆమె అడుగుతుంది. నేను సమాధానం చెప్పక మునుపే ఆమె అంటుంది. "ఇతరులను గురించి ఆలోచించటం ఎంత తొందరగా మర్చిపోతే అంతమంచిది" అని ఒకసారి అన్నది.

"నిమ్ము గురించే సర్వదా తలుస్తూంటానని నీ వుద్దేశమా?" అన్నాను.

"దానిలో తప్పు ఏమున్నదండీ!" ఆమె నవ్వుతూ అన్నది.

"నీకా ఉద్దేశం ఎందుకు కలిగింది?" అన్నాను.

"మీతో ఎప్పుడుబడితే అప్పుడు ఒంటరిగా నేను రాగలగటాన్ని గురించి మీకు ఆలోచన కలుగుతూ ఉండవచ్చుననుకుంటాను." ఆమె అన్నది.

"భర్తతో ఉండని స్త్రీకి సమాజంలో ఎంత గౌరవం ఉంటుందో నీకూ తెలుసు అనుకుంటాను?" అన్నాను.

"సమాజానికి ఆ విషయమే కాదు. ఇంకా అనేక విషయాలుకూడా తెలుసు కాని అది అంతా మన చేతుల్లో ఉంది. మనమీద మనకు గౌరవం ఎంతో మనము తెలుసుకున్నప్పుడు సమాజం మనకు ఎంతగౌరవం ఇస్తుందో తెలుసుకోవచ్చు" అన్నది. ఆమెకళ్ళు కాంతితో మెరిసిపోతున్నవి.

'అది ఎట్లాగో కొంచెం సెలవిస్తావా' అన్నాను.

"మనం చేసేపనులమీద మనకు నమ్మకం లేనప్పుడు ఇతరులకు ఎట్లానమ్మకం ఉంటుందో ఊహించలేను. సంపూర్ణమయిన విశ్వాసంతో... ...ప్రతిపనీ మనం సంపూర్ణమయిన విశ్వాసంతోనే చేస్తుంటామని నా ఉద్దేశం. కనీసం చెయ్యబోయేముందు ప్రతివాడు కొంచెం ఆలోచించి చేస్తుంటాడని నేను అనుకుంటాను." అన్నాను.

"అదికాదండి నా ఉద్దేశం. మనం చేసేపనుల పర్యవసానం మన కర్మానుసారం జరుగుతుంది కాని మనం ఆశించినట్లుగా జరుగదు" అన్నది.

నేను చాలా క్లిష్టపరిస్థితిలో పడ్డాను. కర్మను గురించి "కర్మపర్యవసానాన్ని" గురించి నాకు చాలా విచిత్రమయిన అభిప్రాయాలు ఉన్నవి. విచిత్రమయిన అభిప్రాయాలు అనటంకన్నా అసలు నాకు ఆ విషయాలు తెలియవనే చెప్పాలి. అయినా ఆమెతో జటిలమయిన ఈ సమస్యలను గురించి చర్చించటం ఆమె నోటివెంబడి అటువంటి సమాధానాలు వినటం నాకు సిగ్గువేస్తుంది. నిరంతరం వీచే చల్లని సముద్రపుగాలికి ఆమె తలనుకూడా తెల్లటి చీరకొంగుతో కప్పకుంది. ప్రశాంతమయిన ఆ వాతావరణంలో ఆమెను ఆలకిస్తూ ఉంటే నాకు చప్పున ఒక విషయం జ్ఞాపకంవచ్చింది. సన్యాసినిగా అనిపించే ఆ నిర్వికారమైన ముఖాన్ని ఎక్కడో నేను చూచినట్లుగా గోచరిస్తుండేది. కాని చెప్పలేను. ఈనాడు నా ఎదుట చూస్తున్న ఈ విగ్రహం నా ఊహాచిత్రాలలో గోచరించే ఒక దేవతమూర్తదే నేమో.

ఆమె వివాహిత. ఆమెను ఒకసారి మాటల సందర్భంలో "మీ భర్త ఏమి చేస్తుంటాడు?" అని అడిగాను.

ఆమె నవ్వుతూ అంది. "ఇతరుల విషయంలో అనాలోచితమైన కుతూహలం చూపటం అనవసరం."

"ఏదో సామాన్యుని సందేహం" అన్నాను.

ఆమె నవ్వుతూ కాఫీకలిపి ఇవ్వటానికిలేచింది ఆమె వస్తుతహా మితభాషిణి. ఆమె స్వవిషయాలు సంగతి వేరేచెప్ప నవసరంలేదు.

"నా సేవవల్ల నేను గుర్తు ఉండాలిగాని నా పేరు ఊరు నా భర్తపేరు వీటితో ఎంతకాలం గుర్తు ఉంచుకుంటారు?" అని అంది. అదీ నిజమే. ఆమె లేనిది ఇప్పుడు నాకు ఒక నిముషం గడువదు. నాకు ఏ క్షణానికి ఏమి కావాలో ఏ క్షణంలో ఏమి కోరుకుంటానో ఆమెకు బాగా తెలుసు. ఎదుటి మానవుని మనస్సు కొంచెం కూడా నొప్పించకుండా ఆమె మసులుతుంది. ఆమె చూపులలో నిదానం తొణికిసలాడుతుంది. ఆమె పనులలో నిండుతనం—ఆమె వ్యక్తిత్వానికి ఇవే పునాదులు. ఆమె వైవాహకస్థితిగతులు, పుట్టుపూర్వోత్తరాలు నాకు ఇంతవరకూ తెలియక పోయినా ఆమె అంటే ఇక్కడ అందరికీ చాలా ఆదరణ, నా విషయం వేరే చెప్ప నవసరంలేదు. ఆమె లేనిది నాకు బొత్తిగా గడవటంలేదు.

"మీరు ఎందుకు పెళ్ళి చేసుకోరు?" అని అడిగింది ఒక రోజు.

నాలో ఎన్నో సంవత్సరాలనుండి నిద్రావస్థలో ఉన్న కోర్కె ఈనాడు మళ్ళా జనించింది. నేను నీతో చెప్పిన మాటలు నాకు వెంటనే జ్ఞాపకం వచ్చినవి. పెళ్ళి చేసుకోవటం అసలు ప్రశ్న కాదని ఎవరిని పెళ్ళి చేసుకోవాలనేది ముఖ్యమని అని అప్రయత్నంగా.

"నీలాంటి నిర్మల నాకు ఎప్పుడు దొరికితే అప్పుడు తప్పనిసరిగా పెళ్ళి చేసుకుంటా" నన్నాను.

"మీ ఉద్దేశం నన్ను గురించేనా?"

"అవును" అన్నాను.

ఆమె నిశ్శబ్దంగా రెండు సెకండ్లు కళ్ళు మూసుకుంది. ఆమె నా రెండు చేతులను తన చేతులలోనికి తీసుకొని తదేకంగా నా ముఖం వంక చూస్తూ అన్నది.

"మీకు ఆ కోర్కె వద్దు బాబూ. ఇదివరకే ఎప్పుడో ఈ శరీరమూ ఆత్మ రెండూ ఒకరికి అంకితం అయిపోయినవి. వీటికోసం మీరు ఈనాడు ఆశించవద్దు. నాకు మొదనుండీ తెలుసు. ఏదో ఒకనాడు మీరు నన్ను అడుగుతారని. ఆనాడు మిమ్ములను క్షోభ పెట్టవలసి వస్తుందని కూడా తెలుసు. ఈనాడు నాకు ఏ కోర్కె లేదు. అటువంటిదానికి మళ్ళా కొన్ని బంధాలను కల్పించకండి. స్త్రీనై ఉండి బ్రతుకుకోసరం మీబోటి వారిని ఆశించ నవసరం నాకు అసలు లేదు. ఆ విషయం మీకు తెలుసు. ఇక పోతే నాజీవితం అంటారా. ఇంతవరకు అనేక విషయాలు చూచాను. నా భర్త ఇంకా సజీవుడు. ఈనాడు కాకపోయినా ఏనాటికయినా నా వద్దకు వస్తాడని నాకు నమ్మకం ఉంది. ఆ నమ్మకంఉన్నందు వలననే నేను ఇట్లా జీవిస్తున్నాను. లేక పోయినట్లయితే ఏనాడో సన్యాసిని అయిపోయేదాన్ని. నా భర్తనుకూడా మొట్టమొదట ఇట్లాగే ఒక హాస్పిటల్ లో కలుసుకున్నాను. అప్పుడు అతనికి సేవ చేస్తూండేదాన్ని. తర్వాత మా యిద్దరికీ వివాహం అయింది. మీకు మరీమరీ నేను చెప్పేదేమిటంటే స్త్రీకి ఒక్కసారే వివాహం జరిగేది. ఇప్పటికీ ఆ ఉద్దేశాన్ని నేను మార్చుకోలేను. బలవత్తరమైన కారణంలేనిది మార్చుకోలేను కాని నా భర్త బహు తేలికగా ఆ ఉద్దేశాన్ని తోసివేసారు. అప్పుడుకూడా నేను బాధపడలేదు. కాని ఒక రోజున అతనివద్దనుండి ఒక జాబు వచ్చింది. అందులో అతడు మా యిద్దరిమధ్యా బంధాలు పూర్తిగా తెగిపోయినవని వ్రాస్తూ నేను నా యిష్టంవచ్చినట్లు నడచుకోవచ్చునని వ్రాసారు. నిజంగా ఆ ఉత్తరం చదివినతర్వాత అతన్ని క్షమించలేను. నా భర్త పరమ మూర్ఖుడు అని అనుకున్నాను. రోజులు గడచిపోతున్నవి. ఇప్పుడు కోపంకూడాలేదు. అతని మీద కోపంపోయి చాలా రోజు లయింది. నిర్విచారంగా వ్యాకులరహితంగా కాలం గడుపుతున్నాను. ఏవిధంగా చూచినా నేను మీతో రావటానికి నాకు కారణాలు కనిపించటంలేదు. మీరుమాత్రం నామీద కోర్కె పెట్టుకొని చెడిపోకండి. వీలుగా ఉంటే సాధ్యమయినంతవరకూ ఈ పట్టణం విడచిపోవటానికి ప్రయత్నించండి. నావల్ల ఎవ్వరికీ ఎటువంటి బాధ కల్పించవద్దని భగవంతుని ప్రార్థిస్తూ ఉంటాను." ఆమె అన్నది.

నిశబ్దాన్ని చీల్చుకొనివచ్చే ఆమె మాటలను గురించి ఏమిచెప్పేది?... ప్రతి అక్షరం ఆమె హృదయంలోనుంచి మాట్లాడుతున్నట్లుగా నాకు తోచింది. అంతే ఇంక చెప్పలేను.

మరునటిదినం ఉదయం మామూలుగానే ఆమె వచ్చింది. నేను వస్తువులన్నీ సర్ది బయలుదేర బోతున్నాను. ఆమె ముఖంవంక చూడలేకపోయాను. ఆమె తలుపుదగ్గరగా వేసి నా వద్దకు వచ్చి అన్నది.

"నేను తప్పు చేశానని మీరు అనుకుంటే నన్ను మనసారా క్షమించండి"

ఎవరిని ఎవరు ఏమని క్షమించేటట్లు! నాకు నిజంగా బిగ్గరగా నవ్వుకోవాలనిపించింది.

"నన్ను పూర్తిగా మర్చిపోవాలని మిమ్ములను కోరుకుంటున్నానుగాని పూర్తిగా మాత్రం మరువవద్దు" ఆమె కళ్ళల్లో నీరునిండుతున్నది.

అమ్మా, ఇప్పుడు చాలా దూరదేశం వెళ్ళుతున్నాను. ఏ మనశ్శాంతిని వెదుకుతుంటూ ఇక్కడకు వచ్చానో ఇప్పుడు దేనిని వెదుకుతుంటూ ఎందుకు వెళ్లుతున్నానో నాకు తెలిస్తే బాగుండును! కాని తెలియటంలేదు. ★